కొమ్మ చిగురించింది

"అమ్మా, ఎందుకింత ముదురు ఎరుపు రంగు చీరె కొన్నావు? నాకు వుందిగా ఈ రంగు!" అన్నది నిర్మల, బట్టల పేకెట్లు అన్నీ విప్పి పడేసిన తరువాత.

"అది నీకు కాదే, నాకు. నీకు అదుగో, ఆ గోల్డు కలరు చీరె తెచ్చాను" అన్నది హేమలత, పర్సులోని డబ్బులన్నీ టేబిలుమీద గుమ్మరించి లెఖ్ఖచూస్తూ. "నీకా?" అని నోరు తెరిచి అమ్మ వంక చూసి, "నీకేం బాగుండదు. ఆపైన నీ యిష్టం" అని చెప్పేసి తన కోసం కొన్న చీరె తీసి భుజంమీద వేసుకుని చూసుకోసాగింది నిర్మల.

"ఏం, ఎందుకు బాగుండదూ! అంత నల్లగా వున్నానా నేను? నాకు, మీ డాడీకి చాలా ఇష్టం ఆరంగు" అన్నది హేమలత.

"రంగు కాదు. నీకు టెరిలిన్ బాగుండదు. నీ ఇష్టం అన్నానుగా?" అన్నది నిర్మల. ఆ తరవాత నవ్వేసింది. జాకెట్టు బట్టలు అవీ అన్నీ చూసి, తనని వెంట తీసుకుని వెళ్ళకుండా బజారు పని చేసినందుకు అన్నీ దండుగ బేరాలు చేసింది అమ్మ అని తేల్చింది.

అది తన చీరె తీసుకుని అవతలికి వెళ్ళాక, హేమలత ఎర్రచీరెని చేతుల్లోకి తీసుకుని చూసింది. మెత్తగా జారిపోతూ ఎంత బాగుందో ఆ చీరె! తను సందేహిస్తూనే కొన్నది. కానీ, తను కట్టే నూట ఇరవై నంబరు వెంకటగిరి కంటే ఏమీ పలచగా వుండదనుకుని కొన్నది. పద్దెనిమిదేళ్ళ క్రితం తను ఆ రంగు మైసూర్ జార్జెట్ చీరె కట్టుకున్నప్పుడు ఆయన తనని ఎల్లా కళ్ళతో అభినందిస్తూ, ప్రేమిస్తూ చూసిందీ గుర్తుకి రాక మానదు. సంక్రాంతి రాబోతూంది కదా, పండుగనాడు కొత్తచీరె కట్టుకోవాలి కదా అని ఇదే తీసుకుంది. నిర్మల చటుక్కున అనేసింది ఆ మాట.

పోనీ, దానికే ఇచ్చేస్తేనో—కానీ, అది వద్దన్నది. వద్దన్న వస్తువు ఏమైనాసరే ముట్టదు, కావాలన్న చీరె వదిలిపెట్టదు. తను మనసుపడి కొన్న చీరె కట్టుకోవడానికి ఇంత ఆలోచన దేనికీ? ఇప్పుడే తనకి బాగుండనప్పుడు ఇంక నాలుగేళ్ళు పోతే అసలు బాగుండదు. కాబట్టి కట్టుకుని తీరాలి. ఎర్ర జాకెట్టు బట్ట తీసి దాని పక్కన పెట్టి చూచి, సంతోషపడి, అవన్నీ తీసుకుని బీరువాలో పెట్టడానికి బయలుదేరింది హేమలత.

రాత్రి ఆయన రాగానే చూపించి, "ఏమండీ, నాకు బాగుండ దంటోంది అమ్మాయి" అని చెబుదా మనుకుంది. కానీ, ఆమె నిద్రపోయాక వచ్చారాయన. ఆ నిద్రలో అన్నం తిన్నారా అని అడగడానికే కళ్ళు తెరవలేక పోయింది. ఇంక చీరె సంగతి అడిగే దెల్లా? తెల్లారి ఏడున్నరకే వెళ్ళి

పోయారు. మరునాడు మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు చూపించింది. "ఏమండీ, నే నిల్లాంటి చీరె కట్టుగుంటే బాగుం డదా?" అని అడిగింది.

రామమూర్తి నవ్వి, "ఎవరన్నారు?" అన్నాడు చీరెని చేత్తో పట్టుకుని చూచి.

"నిర్మల అన్నది. పలచగా వుంది, బాగుండదందండి."

ఆయన మళ్ళీ నవ్వి, "ఏమో మరి! నాకు తెలియదు. నువ్వు ఏది కట్టుకున్నా అందంగానే వుంటావు" అన్నాడు.

"ఏది కట్టుకున్న అని కాదు. పద్దెనిమిదేళ్ళ క్రితం సంవత్సరాదినాడు ఈ రంగు చీరె నేను కట్టుకుంటే ఎంతో బాగుందని మీరు మెచ్చుకున్నారు. అందుకే కొన్నాను" అప్పటి దృశ్యమంతా గుర్తుచేసుకుని ఆయన సంతోషపడతా డని అనుకుంది హేమలత.

"అబ్బ ఎంత గుర్తు నీకు! నేను అల్లాంటివి అప్పుడే మరిచిపోతాను. మరి—నా భోజనం మాట చూడవూ?" అన్నా డాయన.

"పెడతాను. ఇంతకీ ఇది కట్టుకోనా, వద్దా?"

"కట్టుకో—కొనుక్కున్నావుకదా? అమ్మాయి ఏదో అన్నదని అనుమానం దేనికి?" భోజనానికి తొందర పడ సాగాడు రామమూర్తి. వందలు, వేల రూపాయల వ్యాపార విషయాల్లో ఇదిఒక సమస్యే కాదతనికి, మరి.

◆ ◆ ◆ ◆

"నీ చీరె చాలా బాగుంది, హేమలతా!" అన్నది మిసెస్ నాయుడు, అద్దం దగ్గర నిలబడి తలలో పూలు సవరించుకొంటున్న హేమలతతో.

"చీరె సంగతే చెబుతావేం? అది కట్టిన సుందర విగ్రహం సంగతో." అన్నది మిసెస్ శాస్త్రి నవ్వుతూ. సిగ్గయిన చిరునవ్వుని అట్టే ఆపేసుకుని వెనక్కి తిరిగి, "ఎంతో సందేహిస్తూ కట్టాను దీన్ని. మా నిర్మల గొడవ చేసింది విశాఖపట్నం కాన్ఫరెన్సుకి మాత్రం దీన్ని పట్టుకెళ్ళడానికి వల్ల కాదని అన్నది చీరె కుచ్చెళ్ళు సాపుచేసుకుంటూ.

"ఏం? చక్కగా వుంది మీకీ రంగు. కొత్త పెళ్ళికూతురిలా వున్నారు." అంటూ గదిలోని ముగ్గురూ మెచ్చుకున్నారు. అందరూ చేరి ఒకవాన్ ఎక్కి సముద్రంలో షికారుకని బయలుదేరారు.

కాన్ఫరెన్సు అనే ఒక తతంగం పూర్తయింది. ప్రతినిధులుగా వచ్చినవారు వింతలు విశేషాలు చూడడం మిగిలింది. సముద్రం షికారుకి ఏర్పాటు చేసిన కరుణాకరం అనే ఆఫీసరు వీరికి ఎదురువచ్చి పరిచయం చేసుకున్నాడు. చక్కని విగ్రహం అతనిది. పాతిక, ముప్పై సంవత్సరాలు వుంటాయి. పరిచయాలు అయినాక స్టీమ్‌లాంచి మీద ఎక్కించారు. గాలి, ఒక మాదిరి పచ్చరంగు నీళ్ళు, ఆ నీటిని కోసుకుని పోయే లాంచి. చుట్టూ కొండల్లాగ ఎత్తైన స్టీమర్లు. అక్కడే వాటిని ఆనుకున్నట్లున్న కొండలు.. వద్దంటువ్నా వినక స్టీము లాంచి అంచున కూర్చున్నది హేమలత. కరుణాకరం ఏదో చెబుతూంటే అందరూ గుమిగూడి వింటున్నారు. అ తరవాత

ఒక స్టీమరు లోపలికి వెళ్ళి చూచారు. అక్కడ కేబిన్ల మధ్య నడుస్తూంటే, "మిమ్మల్ని ఇదివరకు ఎక్కడో బాగా చూచినట్లుందండీ" అని మాట కలిపాడతను.

"ఏమో మరి, నాకూ అల్లాగే అనిపిస్తోంది" అన్న దామె.

ఎక్కడుంటారని అడ్రసు అడిగి తెలుసుకున్నాడు. అతని వెంటే తనూ నడవటం, అతని వెంటే ఇనప బద్దీల మెట్లు దిగడం జరిగింది. లాంచిలోకి మళ్ళీ ఎక్కేటప్పుడు "ఫర్వా లేదు" అంటూ చనువు తీసుకుని చేయి అందించాడు కూడా.

లాంచి సముద్రం లోపలికి పోతూంటే అలల ఊపు తెలియ సాగింది. వేగంగా, అతి వేగంగా సాగుతూ సము ద్రంలో కొంతదూరం పోయింది. సబ్ మేరీన్‌లు అప్పుడే వచ్చిన స్టీమర్లు చూపించాడతను. దీపాలు వెలుగుతూంటే ఎవరో హేమలతని పాట పాడమన్నారు. పాడింది. "ఎంత బాగా పాడారండీ!" అని మెచ్చుకున్నాడతను.

కళ్ళలో ఆ దీపాలు మెరుస్తూంటే, మెత్తని తన ఎర్ర చీరె గాలికి రెపరెపలాడుతుంటే, చేతిని బుగ్గకి ఆన్చి పాడింది పాట. అంతటినీ వింత కళ్ళతో చూసింది. "రేపు ఎక్కడికి వెడుతున్నారు?" అని అడిగాడతను. "అరకువేలీ వెడు తున్నాం—మీరూ రాకూడదూ?" అన్నది. "రావచ్చు మీరు పిలుస్తోంటే తప్పకుండా రావచ్చు" అన్నాడు. ఆ సాయంత్రం అల్లా జరిగింది.

తిరిగి వచ్చాక అందరూ ఏవో పనుల్లోకి పడిపోగా, హేమలత అద్దం దగ్గరకు వెళ్ళింది. సాయంత్రం జరిగిన విషయాలన్నీ మనస్సులో కదులుతున్నాయి. ఎర్రని పెదిమలు, తెల్లని పలువరస గల కరుణాకరం గుర్తుకు వస్తున్నాడు. అతడు మాట్లాడిన తీరు మరువరానిదిగా వుంది. అద్దంలో చూసుకుంటే తనకి నుదుటిపై కనబడిన తెల్ల వెంట్రుకలు నాలుగు, యిదివరకులాగ నిరాశ కలిగించలేదు. ముప్పై ఎనిమిదేళ్ళ వయస్సుని, ఎమ్. బి. బి. ఎస్. చదివే కొడుకుని, బి. ఎస్సి. లో చేరబోతున్న కూతురిని తలుచుకున్నది. కానీ, అంత వయస్సు పిల్లలు తనికి వున్నారా అని తనకే తనే ఆశ్చర్యపోతూ వంగి ప్రతిబింబంలో కళ్ళలోకి చూసుకుంది. నల్లని కనురెప్పల క్రింద ఒక లాలసభావం తొంగి చూస్తూంది. లజ్జతో, ఆహ్వానంతో నిండిన చూపు చురుక్కుమని వస్తూంది. కన్నెగా ఝల్లనిన ఎదపై చేయి వుంచుకుంది. తప్పులేదు సుమా, అనుచితం కాదు సుమా అన్నట్లు గుండెని సవరించుకుంది హేమలత.

◆ ◆ ◆ ◆

మరునాడు కరుణాకరం రానే వచ్చాడు, అరకులోయ ప్రయాణానికి. వంపులు తిరిగిన కొండదారి పైన కారు హోరు మని శబ్దం చేస్తూ పోతూంటే, అతను ఏదో మాట్లాడుతూనే వున్నాడు. "మీ కిద్దరు పిల్లలా? మైగాడ్! మీరే కాలేజి

అమ్మాయిలా వున్నారే!" అన్నాడు. ముఖం పక్కకి తిప్పు కుని, "అల్లాగా!" అని మెల్లిగా అన్నది. ముఖం ఎర్రబడింది.

"ఆ కొండల మీద ఎదురుగా ఆ మామిడిచెట్లు చూడండి అంతా కొత్త చిగురే. కొత్త ఎర్రచీరె కట్టుకుని ఉదాహరణకి నిన్నటి హేమలత గారిలాగ—ఎంత సొగసుగా నిలబడిందో! ఈ అరణ్యానికి రాణిననుకుంటోంది. జిలుగు చెట్లు చూశారా, బలమైన పల్లెటూరి మగవాళ్ళలాగ ఎల్లా వున్నాయో?" అంటూ అతను చేయి చాపి చూపించాడు. అందరితోటి అతను మాట్లాడాడు కానీ, తనకోసం ఒక ప్రత్యేకమైన కంఠం, ఒక ప్రత్యేకమైన చూపు దాచివుంచి, అప్పుడప్పుడు వలలాగ తన మీద విసిరి, బంగారు చేపలాంటి తన మనస్సుని పట్టివేసి నట్లు అనిపించింది హేమలతకి.

అడవి చెట్ల వాసన, అడవి ఆకుల చల్లదనం, కళ్ళకి కొత్తదనం చూపించే ఏవో రంగు రంగుల పూలు, పరచిన పచ్చని కాన్వాసు లాగ వున్న పర్వతాలు చూసింది ఆమె. అక్కడక్కడ నిద్రపోతున్న ఇళ్ళని, స్వచ్ఛంగా పారే ఊట నీళ్ళతో మెట్లు మెట్లుగా అరిలు ఏర్పాటుచేసి పండిస్తున్న పంటని చూసింది. పెను సింహాల్లా వున్న ఈ కొండలని లొంగదీయాలని మనిషి పట్టిన కుస్తీ అక్కడక్కడ కనిపించింది. ప్రకృతిలాగ సహజంగా పుట్టి పెరుగుతున్న మనుష్యులు కనపడ్డారు. పాట పాడమంటేనే సిగ్గు ముంచెత్తుకురాగా వంకర్లు తిరిగిన వయ్యారి వనితలు కనపడ్డారు. ఎక్కడో

దూరదూరాలకి మనస్సుని తీసుకుపోయే పాటలు విన్నారు. దోరవెన్నెట్లో తడిసిపోతున్న ఆ పల్లెల్ని చూస్తూ, చెంపలని చురుక్కున తాకే చల్లగాలికి వణుకుతూ, చీకటి లాంటి అడవిలో ఏదో అందం చివరిసారి ఇంకా కనపడుతుందేమోనని వెతుకుతూ తిరుగు ప్రయాణం ప్రారంభించారు. తిరిగి వచ్చాక కరుణాకరం, "రేపే వెళ్ళిపోతున్నారా? మీ ఊరొస్తే కనబడుతారా?" అన్నాడు. జవాబు చెప్పిన ఆమె కంఠంలోకి ఏదో సున్నితత్వం వచ్చింది. వీణ మీటు లాంటి ఒక ధ్వని నవ్వులో దాగి పలికింది. ఆ ప్రయాణం అల్లా ముగిసింది.

◆ ◆ ◆ ◆

ఆ ప్రయాణం ముగిసిందనుకుందే కానీ హేమలత దాని తాలూకు ప్రణయం ముగిసిం దనుకోలేదు. పిల్లగాలిలా వీచి అడవిలోని మావిపూల సుగంధం తెచ్చి, మనస్సు పైన పూసిన ఆసంఘటనలు మరిచిపోలేకపోయింది. మరువనీయకుండా వారం రోజులకే టెలిఫోన్ చేసి, కరుణాకరం—"ఊళ్ళోకి వచ్చాను, ఇంటికి ఎప్పుడు రాను" అని అడిగాడు. టీకి రమ్మన్నది. అన్నాక—కాదు, అనేటప్పుడే—కాదు, అనే ముందే గుర్తు కొచ్చింది. రామారావు, నిర్మల ఆ టైముకి యింట్లో వుండరని.

రెండు గంటలనుంచి కంటిమీద నిద్ర తేలిపోయింది. ఏమి చీరె కట్టుకోవాలని, అతన్ని ఎక్కడ కూర్చోబెట్టాలని,

ఏమి మాట్లాడాలని-అన్నీ ఆలోచనలే. తాపత్రయం మనస్సులో. అద్దం ముందు కూర్చుని కళ్ళు, ముఖం చక్కగా దిద్దుకుంది. కాటుక వేళ్ళతో రెప్పల వెంట్రుకలు ఎగదోసింది. పెదిమలకు అంటీ అంటని రంగు పూసింది. లేత నారింజ రంగు మెరిసే చీర కట్టుకుంది. డ్రాయింగ్ రూమ్ అంతా సర్ది, సోఫాలో దిండ్లు సరిగా అమర్చింది. మూడున్నరకే అతను వచ్చాడు. గేటులోకి కారు వస్తున్న చప్పుడుకి హేమలత గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. అతను లోపలికి వచ్చిన సవ్వడికి రక్తం వెచ్చగా బుగ్గల్లోకి వచ్చింది. కొద్దిగా తడి వచ్చి తెల్లని కళ్ళు మరింత తెల్లగా మెరిసి పోయాయి.

“బాగున్నారా? అబ్బే, అడగడం నాదేతప్పు. నిజంగా చాలా బాగున్నారు” అన్నాడు కరుణాకరం.

ఏదో మాట్లాడిన తరువాత ,“ఈ వారంరోజుల్లో నేను ఎప్పుడైనా గుర్తువచ్చానా?” అన్నాడు. అతనిల్లాంటిమాటలు అన్నప్పుడల్లా హేమలత హృదయంలో ఒకమూల జివ్వుమనే బాధ బయలుదేరి హృదయాన్నంతటినీ ఆక్రమించి ఆ బరువుకి ఆమెని క్రుంగదీస్తూంది. అంతలోనే అంతా మాయమై మనస్సు దూదిపింజెలా గాలికి గంతులేస్తూంది.

“ఎన్నోసార్లు అనుకున్నాను. మరిమీరో?” అన్నది.

“అనుకుంటే తనివి తీరకే, ఈ ప్రయాణం పెట్టుకున్నానంటే నమ్ముతారా! నిజం, లతా! నన్ను చాలా వెర్రిలో

దింపారు. సాయంత్రం పిక్చర్‌కి వెళ్ళడానికి వీలుంటుందా?" అన్నాడతను.

వెళ్ళడమే! అమ్మో, ఇంకేమైనా ఉందా అనుకుంది వెంటనే హేమలత. అతను పిలిచాక వెళ్ళకుండా మానడమే-అతను ఊళ్ళోంచి వెళ్ళిపోతే బాగుండును.

ధైర్యం కూడదీసుకుని, "మీరు మరీ సిల్లీగా మాట్లాడు తున్నారు" అన్నది.

"ఏం, మీవారికి ఇష్టం వుండదా" అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడక ఊరుకుంది. చివరికి, "చూద్దాం" అని లేచి లోపలికి వెళ్ళింది టీ, టిఫిన్ తీసుకు వస్తానని.

అతనంటే తనకి ఆకర్షణ కలిగిందా? అవును, కలిగింది. మరి తనంటే అతనికి వెర్రి ఆకర్షణ కలిగిందా? అవును, కలి గింది. తను ఎందుకు అతని వెంట పడింది? లేదే, అతనే తన వెంటపడ్డాడు. రెండూ ఒకటేగా? కాదు! తను హద్దుమీరి ఒక్క అడుగు వేయలేదుగా? పెళ్ళయిన ఇరవై రెండు సంవత్స రాలకు తను ఈనాడు మర్యాదను మరిచిపోయి ప్రవర్తించ లేదుగా? కానీ, అతను— ఒకటి కాదు, పది అడుగులు ముందుకు వచ్చేసి, మర్యాదలు, కట్టుబాట్లు అన్నీ తోసేసి తన హృదయద్వారానికి తను మొన్న చూచిన మామిడి పూలు, ఆకులు కలిపి తోరణం కట్టాడు. అక్కడ నిలబడి

అడవిపూలు గుత్తులు కట్టి లోపలికి విసిరేశాడు. ఆ పూల గుత్తి గిలిగింతలు పెట్టింది. ఇదంతా ఎందుకు జరగనిచ్చింది తను?

టీ తయారైంది. పట్టుకుని ముందుగదిలోకి వచ్చేటప్పటికి నిర్మల అప్పుడేవచ్చి పుస్తకాలు లోపల పెట్టడానికి వెడుతూంది. హేమలత టీ టేబిలు మీాద పెట్టింది. నిర్మల అతన్ని పరకాయించి చూసింది. టీ తెస్తున్న తల్లివంక చూసింది. ఆ క్షణంలోనే తల్లి కట్టుకున్న చీరెవంక, మేచింగ్‌గా తలలో తురిమిన కనకాంబరం పూల వంక, ముఖాన దిద్దిన కోలబొట్టు వంక చూసింది. లోపలికి వెళ్ళింది.

హేమలత—“టీ తీసుకోండి” అనిచెప్పి, తనూ కూర్చుంది. చాలా బాగుందంటూ మెచ్చుకుంటూ తాగాడతను. హేమలత నవ్వింది. మెల్లిగా లేచి, “నిర్మలను పిలుస్తాను, ఉండండి” అన్నది. నిర్మల ముందు రానన్నది. “ఎవరో ఆయన, నాకు తెలియదు” అన్నది.

“నేను పరిచయం చేస్తానుగా?” అన్నది హేమలత.

“మరి నేను తయారవాలి” అన్నది నిర్మల.

“బాగున్నావులే, రా, అమ్మా” అని బలవంతం చేయగా, చివరికి ముఖంకడుక్కుని, చీరె మార్చుకుని ఇవతలికి వచ్చింది నిర్మల. నల్లని సిల్కుచీరె పచ్చని ఒంటిమీాద నిలవ

నని జారిపోతూంటే, సర్దుకుంటూ వచ్చి నిలిచి, సంభ్రమంగా "నమస్కారమండీ" అన్నది.

కరుణాకరం టీ కప్పు బల్లమీద ఉంచేసి, "హల్లో! ది యంగ్ బ్యూటీ!" అన్నాడు. నిర్మల ముఖం ఎర్రబడి పోయింది. కళ్ళు అటు ఇటు వెతుకుతున్నట్లు చూశాయి. కూర్చున్నది. ఏదో మాట్లాడాలని ప్రయత్నించింది. అంద మైన యువకుడు, ఆకర్షణీయమైన యువకుడు తనని కళ్ళతోనే అభినందిస్తూంటే, లేతకొమ్మ క్షణాలమీద చిగురించసాగింది. ఏం చదువుతున్నారు లాంటి ప్రశ్నలు వేశాడు కరుణాకరం. మీరు ఎక్కడుంటారు లాంటి ప్రశ్నలు అడిగింది నిర్మల. హేమలత చూపు మార్చి మార్చి ఇద్దరినీ చూస్తూంది. అతను మాత్రం నవ్వుతూ మధ్యలో తనతో మాటలు కలుపు తున్నాడు. ఉన్న రెండు కళ్ళనీ రెండు వైపులా నిలపలేక, నిలపాలన్న కోరికని ఎల్లా తీర్చాలో తెలియక తికమకపడు తున్నట్లు చూస్తున్నాడు.

అతను పొద్దు పోయేవరకు కూర్చున్నాడు. అక్కడ కూర్చున్న నిర్మల అక్కడే కూర్చుండిపోయింది. హేమలత ఒకసారి లోపలికి వచ్చివెళ్ళినప్పుడు, ఆమెకూడా వెంటేవచ్చి "సినిమాకి వెడదామంటున్నారమ్మా!" అన్నది.

"వద్దమ్మా! అతన్ని పంపేద్దాము ఇంక. నాన్నగారు ఫోన్ చేశారు— మిస్టర్ నారాయణ ఇంట్లో డిన్నరుట మనకీ వెళ్ళ" అన్నది హేమలత.

ఇద్దరూ డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చాక, "ఈసారి సినిమా వద్దండీ- డిన్నర్ ఎంగేజ్‌మెంటు ఉన్నది" అని చెప్పింది.

"అరే! పోనీ, నేనింక వెళ్ళి వస్తాను. మరి ఎప్పుడు మళ్ళీ దర్శనం?" అన్నాడు అతను. అతను తననికాక నిర్మలని అడిగాడని గ్రహించింది హేమలత.

హేమలతని ఆనుకునే నిలబడింది నిర్మల. "మీరు చూశారుకానీ మా ఊరు అమ్మాయికి చూపించవద్దా?" అన్నాడు మళ్ళీ ఆమెవంకే చూస్తూ.

"ఈ మాటు తీసుకువస్తా" అన్నది హేమలత.

"మరి, వెళ్ళనా?" అన్నాడు అనుమతి కోరుతున్నట్లుగా.

హేమలత గడియారం చూసుకుని, "మంచిది, చూద్దాం. మీకు వీలైనప్పుడు ఎప్పుడో రండి" అన్నది.

అతను వెళ్ళి బయట నిలబడగానే కారు వచ్చింది. నిర్మల, హేమలత ఇద్దరూ గుమ్మం దగ్గిరే నిలబడ్డారు. అతను కారుఎక్కి డోర్ వేశాక, నిర్మలతో, "వెళ్ళివస్తా నింక" అన్నాడు. ఆమె తల ఊపింది.

"మాట!" అని ఆమెను పిలిచాడు. ఆమె మెట్లుదిగి వెళ్ళింది. "మా ఊరు రావాలి. అరకు తీసుకు వెడతాము"

అంటూ షేక్‌హాండ్ కోసం చేయి చాచాడు. ఆమె అరక్షణం తటపటాయించి, "నమస్కారం" అనేసింది. కారు స్టార్టయి వెడుతూంటే అతను హేమలతని చూచి చేయి ఊపాడు.

హేమలత వెనక్కి తిరిగింది. నిర్మల ఇంకా అక్కడే వెళ్ళిపోయే కారు వంక చూస్తూ నిలబడిందని తెలుసు. పైకి వెళ్ళింది హేమలత. అక్కడ దీపాలు లేవు. చీకటి వ్యాపిస్తోంది. దీపం వేయాలనిపించలేదు. అద్దంలో ముఖంచూసుకోవాలనిపించలేదు. మంచం మీద పడుకుంది అల్లాగే. నిర్మల ఇంకా లోపలికి వెళ్ళిందో లేదో, గేటు దగ్గర కరుణాకరం మళ్ళీ చేయి ఊపిపిలిచాడేమో- ఏమో?

తనకి పధ్నాలుగేళ్ళు ఉన్నప్పుడు, ముద్దబంతి పూవు లాంటి శరీరానికి ఓణీలు వేసుకుంటున్నప్పుడు, దేవాలయానికి వెడుతూంటే అబ్బాయిలు తన వంక చూసేవారు. వయస్సు ఒంటికి మెరుగులు పెడుతున్న రోజుల్లో కాలేజి ఆవరణలో యువకుల కళ్ళు తనని వెంబడించేవి. అప్పటి ఆ ఆకర్షణ అది. ఇరవై సంవత్సరాలనాడు రామారావు మరే పనీ చేయకుండా రోజులోని ఇరవై నాలుగు గంటలూ, గంటలోని అరవై నిమిషాలూ తన ఎదురుగానే కూర్చున్నప్పుడు హేమలత తను అయస్కాంతా న్ననుకునేది. అయస్కాంతానికి అనువైన

మెత్తని ఉక్కులాగ అతనున్నాడు ఆ నాడు. మరి, ఈనాడు అతనేమైపోయాడు? ఏమీ కాలేదు, ఉన్నాడు. అయితే తేడా ఎక్కడవుంది? పద్దెనిమిదేళ్ళ యువతి ఎదురుగా వెర్రికోరికతో కదలకుండా కూర్చున్న ఇరవైనాలుగేళ్ళ యువకుడు రామారావు అప్పుడు. ఇప్పుడో? అతని పనులు అతనివి. నలభై నాలుగు సంవత్సరాల వయస్సు అతనిది.

అందుకే కాబోలు.- కాబోలు నేమిటి- అందుకే- తాను విశాఖపట్నంలో అయస్కాంతమై పోయాననుకుని సంబరపడి కరుణాకరం తన చెవిలో చెప్పిన గుసగుసలు ఆమోదించింది. ఆ బలహీనత, ఆ వెర్రిచేష్ట గుర్తుకి రాగానే నలభై సమీపించబోతున్న ఆమె మనస్సు సిగ్గుపడిపోయింది.

నిర్మల బుగ్గల మీద సాయంత్రం పూచిన గులాబులు తీయని వాసన వెదజల్లినాయి. ఎంతో అందంగా కనుపించాయి గాని, పద్దెనిమిదేళ్ళ కలల ప్రాయాన్ని ఎక్కడో, ఏనాడో వదిలేసి వసంత వనాలన్నీ దాటేసి వచ్చిన హేమలత అద్దంలో చూసుకున్నా కనబడవు ఆ గులాబులు.

చీకట్లో కళ్ళకి కనిపించక పోయినా నుదుట నాలుగు తెల్ల వరకలు పడిఉన్నాయని చూసుకుని హేమలత వాటిని చేతితో సవరించుకుంది. తన వెర్రితనానికి గిజగిజలాడి

పోయింది. కింది అంతస్తులో నిర్మల మనస్సులో మబ్బుపిం తేలగా, పై అంతస్తులో హేమలత మనస్సులో బరువె కారుమేఘాలు ఘోరుమని వర్షించాయి.